క్లుప్తంగా

యూరియా కొరత లేదు



డిచ్‌పల్లి: జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని రూరల్ ఏడీఏ కృష్ణ స్పష్టం చేశారు. గురువారం డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి, సుద్దులం, రాంపూర్ గ్రామాల్లో సొసైటీ గోదాములను ఏడీఏ తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, ఈ–పాస్ యంత్రాల ద్వారా యూరియా అమ్మకాల వివరాలను పరిశీలించారు. ఈ–పాస్ ద్వారానే యూరియా అమ్మకాలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సుద్దపల్లి శివారులోని వరి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అధికంగా యూరియా వాడితే భూసారం తగ్గి చీడపీడలు ఆశించి దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. డిచ్‌పల్లి మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి శ్రీకాంత్, ఏఈవోలు రూపేష్, విలాస్, రైతులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



మోపాల్: ఉపాధ్యాయుల జీపీఎఫ్ డబ్బులు వారి ఖాతాల్లో జమ చేసే తేదీ వరకు వడ్డీ చెల్లించాలని, ప్రభుత్వ హామీమేరకు ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి భట్టు బద్రినాథ్ డిమాండ్ చేశారు. తపస్ సభ్యత్వ అభియాన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని వివిధ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మోపాల్ మండల అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి, గణేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

డిచ్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న మౌలిక సమస్యలు, ఉపాధ్యాయుల కొరతను పరిష్కరించి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంతన్ డిమాండ్ చేశారు. గురువారం డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బి), నడిపల్లి, అమృతాపూర్, రాజారాంనగర్ ప్రభుత్వ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాలయ్య, ఉపాధ్యక్షుడు దాసరి పెంటన్న, మండల అధ్యక్షుడు హకీమ్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

20న గాంధీగంజ్‌లో బోనాల పండుగ

సుభాష్‌నగర్: నగరంలోని గాంధీగంజ్‌లో రిటైల్ కూరగాయల మార్కెట్ వర్తకుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20న బోనాల పండుగ నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై ఓమయ్య తెలిపారు. ఈమేరకు బోనాల పండుగ పురస్కరించుకుని 20న గంజ్‌కు సెలవు ప్రకటించాలని కోరుతూ మార్కెట్ కమిటీ గ్రేడ్–3 సెక్రటరీ మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా మార్కెట్ కమిటీ చైర్మన్, పాలకవర్గం, అధికారులకు బోనాల పండుగ ఆహ్వానపత్రాలు అందించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కండ్లకోయ ప్రసాద్, కోశాధికారి సాయిలు, నాయకులు రాజు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సిరికొండ: మండల కేంద్రంలో పీఎంపీ అసోసియేషన్ తెలంగాణ వైద్యుల సంఘం మండల కార్యవర్గ ఎన్నికకు గురువారం ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పుల్గం మోహన్ ఆధ్వర్యంలో ఎన్నికలు చేపట్టారు. మండల అధ్యక్షుడిగా రుమాండ్ల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా లక్ష్మీరాజ్యం, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా ముత్తయ్య, ఉపాధ్యక్షుడిగా వహీద్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మండలంలోని పీఎంపీలు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	98,500	వెండి(కిలో)	1,16,000
22 క్యారెట్స్	90,927	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	20	40	గాజరుగడ్డ	30	60
బెండకాయ	40	70	పచ్చిమిర్చి	70	100
బీరకాయ	30	50	దోసకాయ	20	40
దొండకాయ	30	60	ఆలుగడ్డ	25	50
బీన్నీసుకాయ	80	120	గోబిగడ్డ	15	30
కాకరకాయ	30	50	గోబిపువ్వు	50	70
వంకాయ	40	60	బీట్‌రూట్	30	60
పాలకూర	30	50	కరివేపాకు	40	60
మెంతికూర	20	40	చామగడ్డ	30	50
కొత్తిమీర	20	40	చిక్కుడుకాయ	40	70
పుదీనా	60	90	గోరుచిక్కుడు	50	80
క్యాప్సికం	50	90			

–సుభాష్‌నగర్

వానమ్మా.. రావమ్మా

- నెర్రెలు బారుతున్న పొలాలు
- ఎండుతున్న దుక్కులు



సిరికొండలో నెర్రెలు బారుతున్న పొలం

సిరికొండ: వర్షాల కోసం అన్నదాతలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. గత నెలలో కురిసిన వర్షాలకు రైతులు వరి నాట్లు వేశారు. పది రోజుల నుంచి వర్షాలు లేకపోవడంతో వరి పొలాలు నెర్రెలు బారుతున్నాయి. మండలంలో పూర్తిగా బోరుబావుల పైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. ఒక్క సాగు నీటి కాలువ లేదు. భారీ వానలు కురవకపోవడంతో చెరువుల్లోకి నీరు చేరలేదు. వాగులు ప్రవహించడం లేదు. వాగులు పారకపోవడంతో భూగర్భ జలాలు వృద్ధి చెందలేదు. దీంతో బోర్లలో నుంచి చుక్క నీరు రాని దుస్థితి నెలకొంది. మండలంలో మేజర్‌గా కప్పలవాగు వరప్రదాయనిగా నిలుస్తోంది. ఈ వాగు పారితే భూగర్భజలాలు గణనీయంగా వృద్ధి చెందుతాయి. సిరికొండ బొడ్డు మామిడి చెరువు, బసంత్ చెరువు, ఎల్లం చెరువు, రావుట్ల ఎదుల్లా చెరువు, న్యావనంది ఊర చెరువు, కొండూర్ రేకుపల్లి చెరువు, హుస్సేన్ నగర్‌లో పోశెట్టి కుంట, బుద్దులవాని చెరువులు నీళ్లు లేక బోసిపోతున్నాయి. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగా వచ్చి ఖరీఫ్ సీజన్ మొదట్లో జూన్‌లో వర్షాలు కురిసినప్పటికీ జూలైలో వానలు జాడలేకుండా పోయాయి. దీంతో పొలాల్లో నీళ్లు ఎండిపోయి నెర్రెలు బారుతున్నాయి. బోర్లలో నుండి నీళ్లు రాక వరినార్లు ఎండిపోతుండటంతో కొందరు రైతులు ట్యాంకర్లతో నీళ్లు పోస్తు నారును కాపాడుకుంటున్నారు.



నీళ్లు లేక ఎండిపోతున్న దున్నిన దుక్కి



బీడుగా ఉన్న భూములు

వన మహోత్సవాన్ని ఉద్యమంలా చేపట్టాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- కాలుష్యరహిత సమాజాన్ని నిర్మిద్దాం



అర్బన్ పార్క్‌లో మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే

సుభాష్‌నగర్: వన మహోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. గురువారం నగరంలోని సారంగాపూర్ అర్బన్ పార్కులో అటవీశాఖ అధికారులు నిర్వహించిన 76వ వనమహోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కాలుష్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని అందుకోసం మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. మానవ మనుగడకు, అభివృద్ధికి పర్యావరణం అత్యంత ఆవశ్యకమని అన్నారు. కాలుష్య నివారణకు, పర్యావరణ పరిరక్షణకు అనేక సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. భారత ప్రధాని అమ్మ పేరుతో మొక్క నాటాలని పిలుపునిచ్చారని గుర్తుచేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులు, అటవీశాఖ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఎఫ్‌ఓ సుధాకర్, ఎఫ్‌ఆర్‌ఓ సంజయ్, ఎఫ్ఆర్ఓలు రవిమోహన్ భట్, రాధిక, సిరివెన్నెల గ్రీన్ సొసైటీ అధక్షుడు జనార్దన్, నాయకులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, పుట్ట వీరేందర్, ఆనంద్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు..



విద్యార్థినికి నగదు పురస్కారం అందిస్తున్న ఎమ్మెల్యే

నిజామాబాద్‌అర్బన్: విద్యతోనే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని, విద్య సమాజ అభివృద్ధికి మూలస్తంభంగా నిలుస్తుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారయణ అన్నారు. నగరంలో కోటగల్లి బాలికల పాఠశాలలో గోర్తి ఈశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారికి నగదు పురస్కారాలు అందిస్తున్న ట్రస్ట్ ఫౌండర్ తిరుపతిరెడ్డికి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులు వైష్ణవికి రూ.15 వేలు, ఆరాధ్యకి రూ. 10 వేలు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో దినేశ్, ఎంఈవో సాయిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించాలి

నిజామాబాద్‌నాగారం: బీసీ విద్యార్థులకు పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కోర్సుల్లో పూర్తిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులను ఎలాంటి షరతులు లేకుండా అందించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ అన్నారు. గురువారం నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కాలేజీల్లో బీసీ విద్యార్థులకు పదివేల ర్యాంకు లోపలే వస్తే ఫీజు రీయింబర్స్మెంట్ ఇస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కార్యదర్శి కొయ్యాడ శంకర్, జిల్లా కార్యదర్శి పాల్కం గంగాకిషన్, నగర అధ్యక్షుడు దర్శనం దేవేందర్, కరిపె రవీందర్, బగ్గలి అజయ్, చంద్రకాంత్, బాలన్న తదితరులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్‌పై నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

డిచ్‌పల్లి: వేల్పూర్‌లో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దాడి చేస్తే పోలీసులు మాత్రం బీఆర్ఎస్ మాజీ ఎంపీపీ, కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నట్లు జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు తెలిపారు. గురువారం భీంగల్ మాజీ ఎంపీపీ మహేశ్, బీఆర్ఎస్ కార్యకర్తలను అరెస్ట్ చేసి పోలీసులు డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలిసిన విఠల్‌రావు, బీఆర్ఎస్ రూరల్ ఇన్‌చార్జి బాజిరెడ్డి జగన్, పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ డి.మధుసూదన్‌రావు, కేసీఆర్ జిల్లా సేవాదల్ అధ్యక్షుడు బి రమణారావు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి అరెస్టయిన వారిని పరామర్శించారు. అలాగే డిచ్‌పల్లి, ఇందల్వాయి మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చి నిరసన తెలిపారు. అరెస్ట్ చేసిన వారిని బేషరుతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఉన్నత విద్యకు పెద్దపీట



నిజామాబాద్‌అర్బన్: రాబోయే రోజుల్లో ఉన్నత విద్యకు పెద్దపీట వేస్తున్నట్లు ఎస్ఎస్ఆర్ కళాశాల చైర్మన్ మారయ్యగౌడ్ అన్నారు. గురువారం కళాశాలలో తెలంగాణ యూనివర్సిటీ రెండవ స్నాతకోత్సవంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్న కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ రవీందర్ గౌడ్, అధ్యాపకురాలు తక్షశిలను సన్మానించారు. పరిశోధన, ఉన్నత విద్యను అభ్యసించడానికి తమ విద్యా సంస్థలు అన్ని సహాయ సహకారాలు అందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్యాం కుమార్, భూమయ్య, యూనిస్, చెరుకుల లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు సన్మానం



నిజామాబాద్ రూరల్: అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా పలువురు న్యాయవాదులను తెలుగు వెలుగు సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దిలీప్‌శాస్త్రి, ఎర్రం విఘ్నేశ్, రాజు, వెంకటరమణగౌడ్, స్నేహ, రఘు, ప్రకాశ్, గంగాధర్, దమోదర్ పాల్గొన్నారు.

గ్రాప్లింగ్ క్రీడాకారిణికి సన్మానం



మోపాల్: కజకిస్తాన్‌లో ఇటీవల నిర్వహించిన గ్రాప్లింగ్ రెజ్లింగ్ ప్రపంచస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించిన మోపాల్ మండలం మంచిప్పకు చెందిన ఎస్‌కె నేహాను గురువారం జెడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమెకు శుభ ఆవని డెవలపర్స్ ఎండీ చీలం వీరారెడ్డి, కేవైటీఎన్ కన్‌స్ట్రక్షన్ డైరెక్టర్ నరేందర్ నాయక్, శ్రీవర్ధన్ ఇన్‌ఫ్రాటెక్ డైరెక్టర్ ఉమేశ్ కొడిగంటి, కెంపు అశోక్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కెంపు అశోక్‌లు ప్రోత్సాహకంగా రూ.50వేల నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు వెంకట్రాం నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేశ్, జై భారత్ యూత్ అధ్యక్షుడు నాయుడు సాయిరాం, ముత్యంరెడ్డి, గొల్ల శ్రీ నివాస్, గాంధారి శ్రీను, సత్యనారాయణ, జగదీశ్ యాదవ్, భూపతిరెడ్డి, నరేశ్‌రెడ్డి, దేవిదాస్, హెచ్ ఎం సాయిలు, పీఈటీ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

హైమాస్ట్ లైట్ల ప్రారంభం

సిరికొండ: మండల కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను బీఆర్ఎస్ నాయకులు గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్సీ కవిత మంజూరు చేసిన నిధులతో నాలుగు లైట్లను ఏర్పాటు చేసినట్లు తెలంగాణ జాగృతి రూరల్ కన్వీనర్ సాయిచరణ్ తెలిపారు. మాజీ వైస్ ఎంపీపీ తోట రాజన్న, ప్రకాశ్, రాజారెడ్డి, సంతోష్‌రెడ్డి, సతీశ్, బాలరాజ్, చిన్నతమ్మి రాజన్న, వీడీసీ చైర్మన్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

మద్దుల్ తండాలో ఘనంగా తీజ్

ధర్పల్లి: మండలంలోని మద్దుల్ తండాలో తీజ్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో డీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్, ఏఎంసీ డైరెక్టర్ మంగిత్య, బాబు రావు, యాదగిరి, తుకారాం, దత్తు, రాములునాయక్, రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

నిజామాబాద్ రూరల్: విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా షీ టీమ్ అధికారిణి స్రవంతి, రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ సూచించారు. ఆర్‌బీవీఆర్ఆర్ పాఠశాలలో విద్యార్థులకు గురువారం సైబర్ మోసాలు, షీ టీంల ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం షీ టీం కు సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, షీ టీమ్ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో స్టాల్స్

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వంద రోజుల ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మెప్మా సిబ్బంది స్టాల్స్ నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ స్టాల్స్‌లో డ్వాక్రా సంఘాల మహిళలు తాము ఉత్పత్తి చేసిన వస్తువులను ప్రదర్శిస్తున్నారు. రెండోరోజు శుక్రవారం బోధన్ బస్టాండ్ సమీపంలోని ఓ కాంప్లెక్స్‌లో, మూడోరోజు శనివారం వినాయక్‌నగర్‌లోని రుక్మిణీ చాంబర్ వద్ద ఈ స్టాల్స్ నిర్వహించనున్నట్లు టీపీఆర్వో చిదుర రమేశ్ తెలిపారు.

పెండింగ్‌లో ఉన్న పెన్షన్ మంజూరు చేయండి

నిజామాబాద్‌అర్బన్: పెండింగ్‌లో ఉన్న పెన్షన్‌ను మంజూరు చేయాలని, వికలాంగుల కార్పొరేషన్‌ను బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి గంగాధర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సమస్యలు పరిష్కరించండి

నిజామాబాద్ అర్బన్: నగరంలోని శంకర్ భవన్ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం పాఠశాలలో విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్కూల్‌లో రెండు వందల మంది విద్యార్థులకు ఒకే బాత్రూమ్ ఉండడం తగదన్నారు. సరైన తాగునీరు అందుబాటులో లేదన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు నిఖిల్, దుర్గాప్రసాద్, సాయి, రాజు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

నేటి చిత్రం

రోడ్డును బాగు చేయండి



ఇందల్వాయి: మండలంలోని గన్నారం గ్రామంలో హనుమాన్ ఆలయం పక్క వీధిలో పదేళ్ల క్రితం వేసిన సీసీ రోడ్డు పూర్తిగా పాడై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గతంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ వేసినప్పుడు రోడ్డు పూర్తిగా పాడై పోయింది. నాటి నుంచి రోడ్డును బాగుచేయాలని అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించాలి.

– ఎల్ గంగారాం, గన్నారం

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

నిజామాబాద్ అర్బన్ - 95531 30597 నిజామాబాద్ రూరల్ - 97053 46541

అధ్వాన రోడ్లపై ప్రయాణం సాగేదెలా?





మాధవనగర్ ఆర్వోబీ వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

- మాధవనగర్ ఆర్‌వోబీ వద్ద ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

నిజామాబాద్ రూరల్: మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా పనులు జరిగే చోట రాత్రి వేళల్లో ఎలాంటి విద్యుత్ లైటింగ్ లేకపోవడంతో పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కురుస్తున్న చిన్నపాటి వర్షాలకు రోడ్డు మొత్తం చిత్తడిగా మారుతోంది.

దీంతో ప్రయాణికులు బురదలో వాహనాలు జారి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి గుంతలమయమైన రోడ్డును బాగు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ప్రయాణం భారంగా..



మాధవనగర్ రైల్వే వంతెన వద్ద ఏర్పడ్డ గుంతలు ప్రమాదకరంగా మారాయి. దీంతో ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటేనే ఇబ్బందిగా ఉంది. అంతేకాకుండా ఈ ప్రాంతంలో లైట్లు సరిగా లేవు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అధికారులు స్పందించాలి.

– లింబాద్రి, ప్రయాణికుడు

లైట్లను ఏర్పాటు చేయాలి..



ఆర్వోబీ పనులు ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నాయి. అలాగే అక్కడ ఏర్పడ్డ గుంతలతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిస్తే ఆ ప్రాంతమంతా చిత్తడిగా మారుతోంది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– శంకర్‌రెడ్డి, ప్రయాణికుడు

ఆక్రమణలు తొలగించారు..

- శ్రీనగర్ కాలనీలో ఆక్రమణలు తొలగించిన అధికారులు
- గేట్, తాత్కాలిక నిర్మాణాలు తీసివేత



గేట్ తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్ సిటీ: నగరంలోని శ్రీనగర్ కాలనీలో కొందరు కబ్జాదారులు కబ్జాకు పాల్పడిన ఆక్రమణలను మున్సిపల్ అధికారులు తొలగింపు చర్యలు చేపట్టారు. ‘శ్రీనగర్ కాలనీలో గల్లీ ఆక్రమణ’ అనే కథనం సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ వెంటనే ఏసీపీ శ్రీనివాస్‌కు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది వెళ్లి రోడ్డు మూసివేస్తూ వేసిన గేట్, నిర్మించిన తాత్కాలిక రేకుల షెడ్డును వెంటనే తొలగించాలని, లేకుంటే తామే జేసీబీతో కూల్చివేస్తామని హెచ్చరించారు. దీంతో సదరు కబ్జాదారులు 30 ఫీట్ల రోడ్డును కబ్జాచేస్తూ నిర్మించిన తాత్కాలిక నిర్మాణాలు, బిగించిన గేట్, రేకుల షెడ్, పార్కింగ్‌ను సైతం తొలగించారు. ప్రస్తుతం ఎప్పటిమాదిరిగా 30 ఫీట్ల రోడ్డు స్థానికులు వెళ్లేందుకు వీలుగా మారింది. గతంలో కూడా కబ్జాచేస్తే అధికారులు హెచ్చరిస్తే తొలగించారు. మళ్లీ యథావిధిగా కబ్జాకు పాల్పడుతున్నారని, సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. 30 ఫీట్ల రోడ్డును కాపాడిన సాక్షి దినపత్రికకు ధన్యవాదాలు తెలిపారు.



తాత్కాలిక నిర్మాణాలు తొలగించిన తర్వాత..



కబ్జాచేస్తూ బిగించిన గేట్ (ఫైల్)

ఎమ్మెల్యేను కలిసిన ఇతిహాస సంకలన సమితి సభ్యులు



సుభాష్‌నగర్: నగరంలోని అర్బన్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఇతిహాస సంకలన సమితి ప్రతినిధులు గురువారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణను కలిశారు. ఖిల్లా రామాలయ అభివృద్ధి విషయమై ఆయనకు వినతిపత్రం అందజేశారు. స్వాగత తోరణం లోపల అసాంఘిక కార్యకలాపాలు, నిర్మాణాల ధ్వంసం జరుగుతుందని వాటిని వెంటనే అరికట్టాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఇతిహాస సంకలన సమితి కార్యాధ్యక్షులు మోహన్ దాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కందకుర్తి ఆనంద్, జిల్లా కార్యదర్శి డాక్టర్ మర్రిపల్లి భూపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు గున్నాల నవీన్ తదితరులు పాల్గొన్నారు.